**కథ**

''రేఖా! నిన్న నే యంత్రం మీ ఇంటికొస్తే తాళం వేసి వుంది. ఎక్కడికెళ్ళారు'' అని అడిగింది లక్ష్మి.

''సినిమాకెళ్ళాం. ఏదైనా పనిమీద వచ్చారా?''

''లేదు. వూరికే ప్రొద్దుపోకుంటేనే వచ్చాను''

లక్ష్మి, రేఖ ఇరుగుపొరుగు వాళ్ళు. రేఖ తండ్రికి ఆ ఊరికి ట్రాన్స్‌ఫర్ అవడంతో రెండు నెలల క్రితమే ఆ వీధిలోని ఓ ఇంట్లో దిగారు. రేఖకు లక్ష్మితో ఈమధ్యే పరిచయం అయింది. లక్ష్మి అవసరానికంటే ఎక్కువే మాట్లాడుతుందని అర్థమైంది రేఖకు.

# హీరో

''అదిగో ఆడంగి వస్తున్నాడు'' అంది లక్ష్మి దూరంగా మోటార్‌బైక్ పైన వస్తున్న వేణుని చూపిస్తూ.

''ఆయన వసుధ భర్త వేణుగారు కదూ. ఎందుకు ఆయనకు ఆ పేరు పెట్టారు?'' అడిగింది రేఖ ఆశ్చర్యంగా.

''ఆడంగి పనులు చేసేవాణ్ణి ఆడంగి అనక ఇంకేమంటారు?''

''ఛ ఛ. ఆయన అందంగా, హీరోలా వుంటారు. మంచి ఉద్యోగంలో వున్నారు. ముఖ్యంగా ఇద్దరు అందమైన పిల్లలకు తండ్రి. ఎంతో డీసెంట్‌గా కనిపిస్తారు. మర్యాదగా మాట్లాడతాడు'' అంది రేఖ.

''అవన్నీ వుంటే ఏం లాభం? మా ఎదురిల్లే కనుక ఉదయం లేచిన దగ్గర్నుంచీ ఆయన చేసేవన్నీ నాకు కనిపిస్తూ వుంటాయి. కూరగాయలు తరిగివ్వడం, క్యారియర్‌లు సర్దడం, స్నానాలు పెట్టడం ఒకటేమిటి.. వసుధ చెప్పిన పనల్లా తప్పకుండా చేస్తూంటాడు. వసుధకు వంట చేయడం తప్ప మరో పనిలేదు'' అంది లక్ష్మి.

''అబ్బ! మీరు చెప్పేది వింటూంటే ఎంతో ముచ్చట వేస్తూంది. మగవాళ్ళు భార్యల కష్టాన్ని అర్థం చేసుకోవడం, వారికి సహాయపడటం గొప్ప విషయం. అటువంటి భర్త ఉన్న వసుధ ఎంతో అదృష్టవంతురాలు''

''సహాయం చెయ్యాలి కాదనను. మరీ అంతగా చెయ్యవలసిన అవసరం లేదంటాను నేను. మగాడన్నాక ఓ హోదా, గౌరవం, ఇగో ఇవన్నీ వుండాలి. లేకుంటే ఆడదానికీ మగవాడికీ తేడా ఏముంటుంది?'' అంది లక్ష్మి.

''భలే వారే! ఆ తేడాలు వుండకూడదని ఆడవాళ్ళంతా పోరాడుతూంటే మీరు తేడాలు వుండాలంటారే'' అంది రేఖ.

''నేను మీతో వాదించి మిమ్మల్ని ఒప్పించలేను గాని, వేణు మాత్రం ఆడంగి పనులే చేస్తున్నాడు. అతనికి ఆ పేరు పెట్టగానే మన వీధిలో వాళ్ళు సరైన పేరు పెట్టావని నన్ను సమర్థించారు కూడా''

''నాకు మాత్రం వేణుగారంటే మంచి గౌరవం వుండేది. మీరు ఆయన గురించి చెప్పాక ఆ గౌరవం మరింత పెరిగింది'' అంది రేఖ.

★ ★ ★

మరుసటి రోజు సాయంత్రం రేఖ.. వసుధ ఇంటికి వెళ్లింది. రేఖను సాదరంగా ఆహ్వానించింది వసుధ. ఇద్దరూ కాసేపు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. మాటల్లో లక్ష్మి ప్రస్తావన వచ్చింది.

''నేనూ విన్నాను. ఆవిడ నన్ను ఏదైనా అన్నా బాధపడేదాన్ని కాను. కాని నాకు ఎంతో సహాయం చేస్తున్న ఆయనకు పేర్లు పెట్టడం నన్నెంతో బాధించింది'' అంది వసుధ.

''మీరు బాధపడకండి. కొంతమందికి తమకు లేనివి ఎదుటి మనిషికి వుంటే ఈర్ష్య కలుగుతుంది. ఆ ఈర్ష్య వల్ల అలా ప్రవర్తిస్తారు. పేర్లు పెడతారు. లక్ష్మి భర్త ఆమెకు ఇంటిపనుల్లో ఏమాత్రం సహాయం చేయరు. పైగా అతనికి క్యాంపులుండే మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం. వేణులాంటి భర్త ఉన్నందుకు మీరు గర్వపడాలి''

''నిజమే. ఆయన సహకారమే లేకుంటే నేనసలు ఈ ఉద్యోగమే చేసేదాన్ని కాను. నిజానికి నాకు ఉద్యోగం చేసే అవసరం లేకున్నా ఇంట్లో వుంటే ఇరుగు పొరుగు వాళ్ళతో మాటలు, గాసిప్స్ తప్పవని, దానివల్ల విలువైన సమయంతోపాటు మనసు కూడా పాడవుతుందని, మనిషి బిజీగా వుంటే అనవసరపు ఆలోచనలు వుండవని ఆయన నన్నీ ఉద్యోగంలో చేర్పించారు''

''వేణుగారు చెప్పింది అక్షరాలా నిజం'' అంది రేఖ.

''అయినా మేము ఎవరి జోలికీ వెళ్ళడం లేదు. ఎవరి గురించీ చెడుగా చెప్పడం లేదు. ఇంటికి వచ్చిన వాళ్ళతో మర్యాదగానే ప్రవర్తిస్తూ వుంటాము. ఎవరైనా తమ ఇంటికి రమ్మని ఆహ్వానిస్తే వెళ్ళి వస్తూంటాము. అయినా కొంతమంది మా గురించి అలా మాట్లాడుకోవడం, పేర్లు పెట్టడం చూస్తూంటే నాకు చాలా బాధ కలుగుతుంది'' అంది వసుధ కళ్ళనీళ్ళతో.

''ఎవరి సంస్కారం వాళ్ళది. మీరు అవన్నీ పట్టించుకోకండి. డోంట్ వర్రీ. బీ హేపీ'' అంది రేఖ సముదాయింపుగా.

రేఖ వెళ్ళిపోయాక వసుధ మనసంతా చిరాకుతో, బాధతో నిండిపోయింది. మరుసటి రోజు నుంచీ భర్త సహాయం లేకుండానే తన పనులు చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చింది.

ఆరోజు ఉదయం నాలుగు గంటలకే లేచి పనుల్లో పడింది. మామూలుగా ఆరు గంటలకు భర్త నిద్ర లేపేది. ఆరోజు కావాలనే అతన్ని లేపలేదు.

ఆరున్నరకు నిద్రలేచిన వేణు టైం చూసి ఆశ్చర్యపోతూ ''నన్ను నిద్ర లేపలేదేం వసూ'' అని భార్యని అడిగాడు.

''మీరు కాసేపు పడుకోండి. నేను చేసుకుంటాను''

తను ఆలస్యంగా లేచినందుకు భార్యకు కోపం వచ్చిందని భావించి.. ''సారీ వసూ. కోపమొచ్చిందా?'' అని అడిగాడు వంటింట్లోకి వస్తూ.

''వద్దండీ ప్లీజ్. మన వీధిలోని వాళ్ళంతా మీకు పేర్లు పెట్టడం నేను సహించలేకపోతున్నాను. అందుకే ఈ రోజు నుంచి నా పనులు నేనే చేసుకోవాలనుకుంటున్నాను. దయచేసి మీరు వంటగదిలోకి రాకండి'' అంది అర్థింపుగా.

వేణుకు ఆమె బాధ అర్థమైంది. ఆ సమయంలో ఆమె తను ఏం చెప్పినా వినదని అతనికి తెలుసు. అందుకే మౌనంగా హాల్లోకెళ్ళి న్యూస్ పేపరు చేతిలోకి తీసుకున్నాడు. అయితే ఆమె పడే అవస్థలన్నీ అతనికి తెలుస్తూనే వుంది. పిల్లల్ని రెడీ చేసి, అన్నం వడ్డించి, క్యారియర్లు సర్ది, వాళ్ళను స్కూలుకు పంపించేసరికి ఆమెకు ఆఫీసుకు వెళ్ళే టైమయింది. గబగబా తానూ రెడీ అయి, స్కూటీలో ఆఫీసుకు వెళ్ళిపోయింది. సమయం లేకపోవడం వల్ల ఆమె టిఫిన్ తినలేదని, మధ్యాహ్నానికి క్యారియర్ కూడా తీసుకెళ్ళలేదని అతనికి అర్థమైంది. తన క్యారియరు మాత్రం ఆమె సిద్ధం చేసి వుండటం చూసి నవ్వొచ్చింది అతనికి.

మధ్యాహ్నం ఒంటిగంటకు వసుధ వద్దకు అటెండరు వచ్చి ''మేడం! మీ సారు ఇప్పుడే వచ్చి వెళ్ళారు. మీరు మేడపైన ఉన్నారని చెబితే ఈ ఉత్తరం మీకివ్వమని చెప్పారు'' అంటూ ఓ కాగితాన్ని ఇచ్చాడు.

తీసి చదివింది.



''క్యారియర్ మీ స్టాఫ్ రూంలో పెట్టేశా వసూ. మనం మనకోసం బ్రతకాలి. మన వాళ్ళ కోసం బ్రతకాలి. ఎవరో ఏదో అన్నారని మన ఆరోగ్యాన్ని, ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడం మంచిది కాదు''

ఉత్తరం చదివాక ఎంతో గిల్టీగా ఫీలయింది వసుధ. 'ఛ. అనవసరంగా తను ఇబ్బంది పడి ఆయన్నీ ఇబ్బంది పెట్టింది. ఆయన అన్నట్లు తను తన కోసం బ్రతకాలి. తన వాళ్ళ కోసం బ్రతకాలి' అనుకుంది. స్టాఫ్‌రూమ్‌లో క్యారియర్ చూడగానే భర్తకు తనపై ఉన్న ప్రేమకు, ఆప్యాయతకు ఆమె కళ్ళలో నీరు తిరిగాయి. 'మా వారు బంగారు కొండ' అని మనసులో పాడుకుంటూ క్యారియర్ విప్పసాగింది.

★ ★ ★

ఆరోజు రెండవ శనివారం కావడంతో ఇంట్లో పిల్లలతో గడిపారు వసుధ, వేణు. సాయంత్రం సినిమాకు వెళ్దాం అని అనుకున్నారు. పిల్లలతో బయటకు వచ్చిన వసుధ.. లక్ష్మి వాళ్ళ ఇంటిముందు ఆందోళనగా నిలబడి వుండటం చూసి ''ఏమిటి అలా వున్నారు?'' అని అడిగింది.

''పిల్లలకోసం చూస్తున్నాను. సిటీలో గొడవలట. మధ్యాహ్నం రెండు గంటలనించీ కర్ఫ్యూ విధించారట. పిల్లలు ఎలా ఇంటికి వస్తారా అని భయపడుతున్నాను. ఆయనా ఊర్లో లేరు. కర్నూలు వెళ్ళారు. రాత్రి వస్తానని చెప్పారు'' అంది లక్ష్మి.

విషయం విన్న వేణు మోటార్‌బైక్ బయటకు తీసి ''మీ పిల్లలు ఏ స్కూల్లో చదువుతున్నారు?'' అని అడిగాడు లక్ష్మిని.

ఆమె స్కూలు పేరు, అడ్రసు చెప్పి ''పిల్లలు స్కూల్లో లేరు. అరగంట క్రితమే బస్సులో బయలుదేరారట. నేను స్కూలుకు ఫోన్ చేస్తే చెప్పారు'' అంది.

''నేను ఆ రూట్‌లో చూసుకుంటూ వెళ్తాను. ఎక్కడో ఒక చోట బస్సు కనిపించవచ్చు'' అన్నాడు వేణు.

''మీరు మాత్రం ఎలా వెళ్తారు. చాదర్‌ఘాట్ వరకూ కర్ఫ్యూ వుందట. మీరు రిస్క్ తీసుకోకండి'' అంది లక్ష్మి.

ఇంతలో ఆమె ఇంట్లో ఫోన్ మోగడంతో లోపలికి పరిగెత్తింది. ఫోనులో మాట్లాడాక బయటకు వచ్చి ''బస్సు డ్రైవరు అబిడ్స్‌లో బస్సు ఆపేశాడట. పిల్లలు జిపిఓ దగ్గర్లో ఎస్టీడి బూత్ నుంచి ఫోన్ చేశారు. చాలా భయపడుతున్నారు వాళ్ళు'' అంది.

వేణు వెంటనే బైక్ స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు. గంటసేపు గడచినా వేణుగాని, పిల్లలుగాని రాలేదు. పిల్లల గురించి లక్ష్మి, భర్త గురించి వసుధ ఆందోళన చెందసాగేరు. విషయం తెలిసి ఇరుగు పొరుగున వున్న ఆడవాళ్ళు లక్ష్మికి ధైర్యం చెప్పసాగారు.

''సమయానికి మన వీధిలో కరెంటు లేదు. లేకుంటే టీవీ ద్వారా కర్ఫ్యూ విషయం మనకూ తెలిసేది. కాస్త ముందు జాగ్రత్త పడేవాళ్ళం'' అంది ఒకావిడ.

''ఎవరో ఉన్మాదంతో చేసే చర్యలు ఎంతమందికి ఆందోళన కలిగిస్తుందో చూడండి. భర్త ఇంటికి రాలేదని భార్య, పిల్లలు రాలేదని తల్లిదండ్రులు, భార్య ఎలా వుందోనని భర్త, ఇలా ఇంతమందికి అసౌకర్యాల్ని కలిగించే మతాభిమానం అవసరమా?'' అంది రేఖ.

ఇంతలో పిల్లలతో వస్తున్న వేణు కనపడ్డాడు. అతన్ని చూస్తుంటే అందంగిలా కనిపించలేదు ఆ వీధి ఆడవాళ్ళకు. ఓ హీరోలా కనిపించాడు.

పిల్లల్ని దగ్గరకు తీసుకుని ''చాలా థాంక్సండీ. చాలా రిస్క్ తీసుకున్నారు మీరు'' అంది లక్ష్మి కృతజ్ఞతగా.

''మరేం ఫర్వాలేదు. పోలీసు డిపార్ట్‌మెంటులో నాకు స్నేహితులు వున్నారు. వారి సహాయంతో పిల్లల్ని తీసుకురాగలిగాను'' అన్నాడు వేణు.

తర్వాత ఇంట్లోకి పోబోతున్న లక్ష్మితో ''మీ వారిని కాంటాక్ట్ చేసి ఈ రాత్రి రావద్దని చెప్పండి. ఉదయం సిటీలో పరిస్థితి తెలుసుకొని బయలుదేరమని చెప్పండి'' అన్నాడు.

ఆమెకు ఎంతో ఆశ్చర్యం వేసింది. ఆ విషయం తను కూడా ఇంత త్వరగా ఆలోచించలేదు. మంచితనం ఉన్న వ్యక్తి తన వాళ్ళ గురించే కాదు, తనకు తెలిసిన ప్రతి ఒక్కరి గురించి ఆలోచిస్తాడని, అందరి క్షేమం కోరతాడని ఆమెకు అర్థమైంది.

తరువాత రేఖను కలిసినప్పుడు వేణు గురించి గొప్పగా చెప్పింది లక్ష్మి.

''లక్ష్మిగారూ! నేను ఆరోజే చెప్పాను వారి మంచితనం గురించి. ఎదుటి మనిషి గురించి చెడుగా మాట్లాడటానికి, పేరు పెట్టడానికి పెద్దగా తెలివితేటలు అక్కర్లేదు. కాని వాళ్ళ మంచిని గుర్తించడానికి మాత్రం ఎంతో సహనం, అవగాహన కావాలి. దయచేసి మీరు పాజిటివ్‌గా ఆలోచించడం అలవాటు చేసుకోండి. దానివల్ల ఎంతమంది మీకు దగ్గరౌతారో మీరే చూడండి'' అంది రేఖ.

''తప్పకుండా. చిన్నదానివైనా చక్కగా చెప్పావు. నీ సలహా పాటిస్తాను'' అంది లక్ష్మి.

★

**సి.ఎస్.చంద్రశేఖర్**